క్లుప్తంగా

కేఎంసీ విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ విద్యాసాగర్, తదితరులు

కర్నూలు(హాస్పిటల్): నెల్లూరులోని నారాయణ డెంటల్ కాలేజీలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగిన 5వ అంతర్ కళాశాలల గేమ్స్ మీట్‌లో కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు బాల్ బాడ్మింటన్ పోటీలో సత్తా చాటి విన్నర్స్‌గా నిలిచారు. ఈ పోటీల్లో మొత్తం 24 మెడికల్, డెంటల్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీలోనూ కర్నూలు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. వీరితో పాటు ఇతర క్రీడాంశాల్లో ప్రతిభ కనపరిచిన వారిని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విద్యాసాగర్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ఉచిత సంగీత తరగతులు

కర్నూలు కల్చరల్: వేసవి సెలవుల్లో సమయం వృథా కాకుండా ఉచిత సంగీత తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వరలక్ష్మి తెలిపారు. ప్రతి మంగళ, గురు, శనివారం రోజుల్లో సాయంత్రం 7 గంటల నుంచి 8 గంటల వరకు జూమ్ ద్వారా సంగీతంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా అన్ని వయసుల వారు పాల్గొనవచ్చని, వివరాలకు 98859 80088 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కల్లూరు: కల్లూరు ఎస్టేట్‌లోని వెంకటచలపతి నగర్‌లో నివాసం ఉంటున్న అన్వర్ బాషా కుటుంబానికి బాల్య స్నేహితులు బుధవారం రూ.36,600 ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. అన్వర్‌బాషా ఓ ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ నాలుగు నెలల క్రితం గుండెపోటుకు గురై మరణించాడు. విషయం తెలుసుకున్న 1985–1986 వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి మిత్రబృందం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

కురువలను అవమానించిన టీడీపీకి బుద్ధిచెప్పాలి

కర్నూలు(అర్బన్): యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌ను కలవన్వికుండా పత్తికొండ, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్‌లు కురువలను తీవ్రంగా అవమానించారని జిల్లా కురువ సంఘం గౌరవాధ్యక్షులు కే కిష్టన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో కురువలు అధికంగా ఉన్నందున లోకేష్‌తో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేయాలని కోరినా, వారు ససేమిరా అన్నారని చెప్పారు. ముందుగా అలారుదిన్నె క్రాస్ వద్ద కురువలతో సమావేశం ఉందని చెప్పిన నాయకులు దాన్ని కూడా రద్దు చేశారన్నారు. కురువలతో సమావేశం నిర్వహించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అత్యధిక ఓట్లు కలిగిన కురువలను కాదని తెలుగుదేశం అభ్యర్థులు గెలవగలరా ? అని ప్రశ్నించారు. జరిగిన అవమానాన్ని దృష్టిలో ఉంచుకొని వచ్చే ఎన్నికల్లో పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లోని కురువలు తెలుగుదేశం పార్టీకి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



డెమో ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలు నివారించవచ్చని అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి చిన్నబజారి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు బుధవారం కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని ఆర్కా హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు రోగులను ఎలా రక్షించాలి, అగ్నిమాపక చర్యలు తదితర వాటిని వివరిస్తూ డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఆస్పత్రి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీకాంప్లెక్స్: శాకుంతలం,దసరా, బలగం, రుద్రుడు, విడుదల పార్ట్–1, రావణాసుర
విమెగా ఆనంద్ సినీకాంప్లెక్:విడుదల పార్ట్–1, శాకుంతలం, రుద్రుడు, మీటర్, దసరా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : విడుదల పార్ట్–1, రుద్రుడు, శాకుంతలం
ఐనాక్స్ : ది పోప్స్ ఎక్సార్సిస్ట్, ది సూపర్ మారియో బ్రదర్స్, విడుదల పార్ట్–1, రుద్రుడు, జాన్ విక్ చాప్టర్–4, రావణాసుర
భరత్ కాంప్లెక్స్ : పోప్, బలగం, మీటర్
శ్రీరామ : మీటర్
రాజ్ : రావణాసుర
విజయ : మీటర్

ప్రవక్త సందేశం స్ఫూర్తిదాయకం

- పవిత్ర రంజాన్‌ను సంతోషంగా జరుపుకోండి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన
- ముస్లింలకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు
- మత సామరస్యానికి ప్రతీక కర్నూలు జిల్లా : ఎమ్మెల్యేలు, మేయర్



నమాజ్ చేస్తున్న ముస్లింలు

కర్నూలు(రాజ్‌విహార్): మహమ్మద్ ప్రవక్త సూచించిన సందేశాలు స్ఫూర్తిదాయకమని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం స్థానిక పాతబస్తీలోని రాయల్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు, మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కర్నూలు జిల్లా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాసాన్ని ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని, శాంతి, సౌభ్రాతృత్వం గురించి మహమ్మద్ ప్రవక్త ఇచ్చిన సందేశాన్ని గుర్తు చేస్తూ ఆయన స్ఫూర్తితో సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా ప్రజలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా మత సామరస్యానికి ప్రతీక అన్నారు. హిందూ ముస్లింలు ఒకరి మతాలను ఒకరు గౌరవించుకోడంతో పాటు పండుగల వేళ పూర్తిగా సహకరించుకుంటారని పేర్కొన్నారు. ఈ మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉండడంతో పాటు భక్తిశ్రద్ధలతో ఐదు పూటల నమాజ్ చేస్తారని, వారికి ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారన్నారు. పేద, ధనిక తారతమ్యం లేకండా ప్రతి ఒక్కరూ ఉన్నదానిలో వీలైనంత మేరకు దానధర్మాలు చేసి, అల్లాహ్ కరుణ, రక్షణ కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని, అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనందాన్నిస్తోందన్నారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, మైనారిటీ సంక్షేమ శాఖాధికారిణి సబిహా పర్విన్, డీఎస్పీ మహేష్ పాల్గొన్నారు.

మే డే ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు(సెంట్రల్): 138వ మే డే వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మే 1వ తేదీన మే డేను పురస్కరించుకొని వాడవాడలా కార్మిక జెండా రెపరెలాడాలన్నారు. చికాగో మృతులు తమ ప్రాణాలను త్యాగం చేసి సంపాదించుకున్న 8 గంటల పని విధానం, 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వంలో కార్మికులు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ పేరుతో అదానీ, అంబానీలకు కట్టబెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు మనోహర్‌మాణిక్యం, చంద్రశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు కల్చరల్: రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న రాయలసీమ కర్తవ్య దీక్షపై చర్చించేందుకు గురువారం ఉదయం 10 గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న సంఘం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

కృష్ణపట్నం నుంచి కర్నూలుకు!

- ఆరోగ్యశ్రీ కింద కర్నూలులో మత్స్యకారునికి గుండె ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్): నెల్లూరు జిల్లా కృష్ణపట్నంకు చెందిన మత్స్యకారుడు వెంకటేశ్వర్లుకు కర్నూలులోని ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్యశ్రీ కింద గుండె శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కార్డియోథొరాసిక్ సర్జన్, హెచ్‌ఓడి డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. వెంకటేశ్వర్లు(38) చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు. మత్స్యకార భరోసా కింద ఇటీవల ప్రభుత్వ సాయం కూడా తీసుకున్నాడు. పాఠశాలలో చదుతున్నందున పిల్లలకు అమ్మ ఒడి పథకం వర్తిస్తోంది. ఇలా ఏ ఇబ్బందీ లేకుండా జీవనం సాగుతున్న అతని జీవితంలో గుండెజబ్బు ఉక్కిరిబిక్కిరి చేసింది. నెల్లూరులోని ఓ రెండు కార్పొరేట్ ఆసుపత్రుల్లో, చెన్నైలోని మరో పెద్దాసుపత్రిలో చూపించాడు. ఆపరేషన్‌కు చాలా డబ్బు ఖర్చవుతుందని చెప్పడంతో భయపడి ఇంటికొచ్చేశాడు. సోషల్ మీడియాలోని ఫేస్‌బుక్‌లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి గురించి తెలుసుకున్నాడు. అక్కడ ఆరోగ్యశ్రీ కిందనే పూర్తి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలుసుకుని ఇటీవల కర్నూలుకు వచ్చి ఆసుపత్రిలో చేరాడు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా డాక్టర్ ప్రభాకరరెడ్డి అతన్ని ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని వారం రోజుల క్రితం సహ వైద్యుడు డాక్టర్ రవీంద్ర, అనెస్తెటిస్ట్ డాక్టర్ కొండారెడ్డితో కలిసి గుండె కవాట మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. బుధవారం వెంకటేశ్వర్లు కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు.

ప్రిన్సిపల్ సబ్ జడ్జి బదిలీ

కర్నూలు(లీగల్): కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.కేశవను అన్నమయ్య జిల్లా రాజంపేట సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేచోట మూడేళ్లు పదవీకాలం పూర్తి చేసుకున్న 40 మంది సీనియర్ సివిల్ జడ్జిలకు సాధారణ బదిలీలు చేపట్టారు. కాకినాడలో పనిచేస్తున్న టి.మల్లేశ్వరిని కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. విశాఖపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.సుజాతను ఖాళీగా ఉన్న ఆళ్లగడ్డ సబ్ కోర్టు జడ్జిగా నియమించారు.

క్రీడల్లో రాణించాలి

కర్నూలు: క్రీడాకారులు ఎంచుకున్న క్రీడలో క్రమశిక్షణ, అంకితభావంతో సాధన చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కర్నూలు అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ సూచించారు. స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రతాపరెడ్డి స్మారక హాకీ పోటీల సందర్భంగా క్రీడాకారులకు హాకీ స్టిక్‌లతో పాటు క్రీడాదుస్తులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. మొత్తం 14 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో రైజింగ్ స్టార్స్ జట్టు 1–0 గోల్స్ చేసి శుభారంభం చేసింది. అలాగే పంచలింగాల జట్టు 2–0 గోల్స్ చేసి మునగాలపాడు జట్టుపై విజయం సాధించింది.

టెన్నిస్ విజేతలకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

కర్నూలు(టౌన్): తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 16న లింగంపల్లి లియో టెన్నిస్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నిస్ పోటీల్లో కర్నూలుకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ప్రతిభ చాటి రన్నర్స్‌గా నిలిచారు. స్థానిక మైపర్ అకాడమీకి చెందిన రామ్‌ధీరజ్ అండర్–10 విభాగంలో ఫైనల్ పోటీలో తలపడి రన్నర్‌గా నిలిచారు. అలాగే స్మైక్ అకాడమీలో అండర్–8 విభాగంలో టెన్నిస్ క్రీడాకారుడు శ్రీకర్ రన్నరప్‌గా నిలిచారు. సబ్ జూనియర్ స్థాయిలో ఇతర రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీల్లో రన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులను బుధవారం జొహరాపురం మైపర్ టెన్నిస్ అకాడమీలో డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రత్యేకంగా అభినందించారు. అకాడమి కోచ్ షేక్ మహమ్మద్ రఫీ ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయండి

కర్నూలు(సెంట్రల్): వెనుకబడిన కర్నూలు జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.గౌస్‌దేశాయ్, నిర్మల, పీఎస్ రాధాకృష్ణ తదితరులు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కోరారు. బుధవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సీపీఎం నాయకులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని కోరారు.

నేడు కృష్ణానగర్‌లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని కృష్ణానగర్‌లో గురువారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు విద్యుత్ శాఖ టౌన్ ఆపరేషన్స్ ఈఈ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



రాజీవ్ కాలనీలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 26వ వార్డు 69వ వార్డు సచివాలయం పరిధిలోని రాజీవ్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ డీఎల్ కాంతారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కాలనీలో సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. జగనన్న పాలనలో ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకే వచ్చి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న వెంట నిలిచి రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, డీఏపీబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, తిరుపాల్, బాలచంద్రారెడ్డి, భీమశంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



ప్రకృతి వ్యవసాయంపై యాక్షన్ ప్లాన్ తయారీకి సామగ్రి అందజేస్తున్న డీపీఎం చంద్రశేఖర్

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరంలో జిల్లాలో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమ తరహాలో చేపట్టాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మద్దూరునగర్‌లోని కార్యాలయంలో అన్ని కేటగిరీలకు చెందిన సిబ్బందితో ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించడంపై దృష్టి సారించాలన్నారు. అలాగే 2023–24 సంవత్సరం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసా యం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో కిచెన్ గార్డెన్, పెరటి తోటలు అభివృద్ధి చేయించాలన్నారు. ఏడాది పొడవున పంటలు ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. యాక్షన్‌ప్లాన్ తయారీకి అవసరమైన పత్రాలను సిబ్బందికి పంపిణీ చేశారు. కన్సల్టెంట్ లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులకు నివారణే ప్రధానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): కాలేయ వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే రాకుండా నివారణ చర్యలు చేపట్టడం ఉత్తమమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి అన్నా రు. వరల్డ్ లివర్ డేను పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక మరణాలు కాలేయ సంబంధిత వ్యాధుల వల్లే జరుగుతున్నాయన్నారు. ఆల్కహాలు, ఇన్‌ఫెక్షన్లు, వంశ పారంపర్యం, ఊబకాయం వల్ల ఈ వ్యాధు లు వస్తున్నాయని తెలిపారు. ఈ వ్యాధులు రాకుండా జీవనశైలి మార్చుకోవడం, మంచి ఆహారపు అలవాట్లు, మద్యపానం మానుకోవడం, బరువు తగ్గడం, వ్యాయామం చేయాలన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి మాట్లాడారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీరాములు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ మోహన్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ గర్భిణులను మూడు రోజులు ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ప్రసవం అయ్యేలా చూడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక టైపిస్ట్ కాలనీలోని 48వ సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గర్భవతులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. అలాగే గర్భవతులను 12 వారాల్లోపు నమోదు చేసి, సమయానుసారంగా ఆరోగ్య సేవలు అందించాలని, వారు కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి వివరాలను ఏఎన్‌ఎం యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. శ్రీరామనగర్ యుపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అన్ని వేళలా సహాయ సహకారాలు



జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జర్నలిస్టులు

కర్నూలు: జిల్లా నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జి.కృష్ణకాంత్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో ఏపీడబ్ల్యుజెఎఫ్ జర్నలిస్టులు పూలబొకే ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తనను ఎప్పుడైనా కలవచ్చని, అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎస్పీని కలిసిన వారిలో ఏపీడబ్ల్యుజెఎఫ్ నాయకులు టి.మద్దులేటి, చిన్న రామాంజనేయులు, డి.హుస్సేన్, వడ్డే శ్రీనివాసులు, సత్యన్న, బసప్ప, నాగేంద్ర, నజీర్ బాషా, సునీల్ కుమార్, రమేష్ తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ మరమ్మతులపై దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): కలెక్టరేట్ దుస్థితిపై జిల్లా కలెక్టర్ జి.సృజన ఇచ్చిన ఆదేశాలు, తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. ఎట్టకేలకు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ, జిల్లా నీటియాజమాన్య సంస్థ, సహకార శాఖ, ఉద్యానశాఖ, సెరికల్చర్, డీఆర్‌డీఏ–వైకేపీ, జిల్లా ట్రెజరీ తదితర శాఖలకు పట్టిన దుమ్ము, ధూళిని దులపడం విశేషం. జిల్లా కలెక్టరేట్‌లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. కలెక్టర్‌గా సృజన బాధ్యతలు స్వీకరించిన వెంటనే కలెక్టరేట్‌లో కలియతిరిగి ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, అడ్డుగోలుగా పెట్టిన పాత సామగ్రిని చూసి అసహనానికి గురయ్యారు. వారం రోజుల్లో అన్ని కార్యాలయాలను శుభ్రంగా మార్చాలని, పాత సామగ్రిని బయటికి తరలించాలని, ఇష్టానుసారంగా అతికించిన పోస్టర్లను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాల ప్రక్షాళనకు నడుంబిగించారు. ఇప్పటివరకు 75 శాతం పనులు పూర్తయ్యాయి. ఏ కార్యాలయంలో చూసినా స్వచ్ఛత పనులు జరుగుతున్నాయి. మరోవైపు కలెక్టరేట్ మరమ్మతులపై కూడా కలెక్టర్ దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ (బిల్డింగ్) డీఈ రవిచంద్ర, జేఈ ప్రత్యూష సిబ్బందితో కలసి కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాల మెజర్‌మెంట్ తీసుకున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్, కలెక్టరేట్ పైభాగం మొత్తం పరిశీలించారు. ఎక్కడెక్కడ మరమ్మతులు అవసరమో గుర్తించి కొలతలు తీసుకున్నారు. బాత్‌రూమ్‌లు, టాయ్‌లెట్లను పరిశీలించారు. వీటన్నిటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడానికి, అన్ని కార్యాలయాలకు రంగులు వేయడానికి ఎస్టిమేట్లు వేస్తున్నామని ఆర్అండ్‌బీ డీఈ రవిచంద్ర తెలిపారు.

బీజేపీని గద్దె దించాలి



ప్రచారభేరీలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

కర్నూలు(సెంట్రల్): అధికారం కోసం 2019లో పుల్వామాలో వీర జవాన్ల శవాలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజకీయం చేశారని, అక్కడ చనిపోయిన 40 మంది జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలంటే బీజేపీని తరిమి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం ప్రచారభేరిలో భాగంగా నగరంలోని బంగారుపేటలో సీపీఎం, సీపీఐ నాయకులు ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వారు మాట్లాడుతూ.. స్వార్థం కోసం సైనికులను రోడ్డు మార్గంలో పంపి 40 మంది జవాన్ల మరణానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉందని అప్పట్లో కశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన సత్యపాల్ మాలిక్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఇంటికి సాగనంపే వరకు పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు రాజశేఖర్, పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కేంద్రంపై పోరాటానికి సిద్ధం కండి



కరపత్రాలను విడుదల చేస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకి/ బోయలను ఎస్టీలుగా గుర్తిస్తు అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపారన్నారు. ఈ తీర్మానం పార్లమెంట్‌లో చట్టబద్ధత పొందేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మే 31వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. బుధవారం స్థానిక వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను వీఆర్‌పీఎస్ నేతలు విడుదల చేశారు. వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కప్పట్రాళ్ల మల్లికార్జున, నాయకులు మురళీనాయుడు, శివ, రాముడు, నాగన్న, గోవర్ధన్, రాజు, అర్జున్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. బుధవారం స్థానిక కొత్త ఈద్గాహ్ మసీద్‌లో ఏర్పాటు చేసిన సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. మసీదు కమిటీ సభ్యులు బాబు, అన్వర్, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ ఉద్యోగులకు ఇఫ్తార్ విందు

కర్నూలు(సెంట్రల్): ఏసీసీ కంపెనీ కర్నూలు యూనిట్‌కు సంబంధించిన ఉద్యోగులు, డీలర్లు, రిటైలర్లు, సేల్స్‌మెన్లు, కాంట్రాక్టర్లకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. స్థానిక ఇంటర్నేషనల్ హోటల్‌లో ఏపీ సేల్స్ హెడ్ జి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విందును ఏర్పాటు చేశారు. అంతకుముందు ప్రార్థనలు చేసిన ఉద్యోగులు ఇఫ్తార్‌కు హాజరై దీక్షను విరమించారు. కర్నూలు సేల్స్ ఆఫీసర్ ఎం.రాధాకృష్ణ, కర్నూలు టెక్నికల్ ఆఫీసర్ ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.